
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

7★★★ జిల్లా వార్తలు

ఆదివారం 2 ఫిబ్రవరి 2025

వేతన జీవులకు ఊరట

నేతన్నలకు నిరాశ

- ఎదురుచూపులకే పరిమితమైన మెగా పవర్‌లూం క్లస్టర్
- నిరాశపర్చిన చేనేత, టెక్స్‌టైల్ రంగాల కేటాయింపులు
- పాఠశాలలకు డిజిటల్ మెరుపులు
- అంగన్‌వాడీ కేంద్రాలకు హంగులు
- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా చూసిన బడ్జెట్‌ను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. వేతన జీవులకు ఊరటనిస్తూ బడ్జెట్‌లో భారీగా మార్పులు కనిపించాయి. స్లాబ్‌లను మార్చడంతో ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తం అయ్యింది. చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహాలు బడ్జెట్‌లో పొందుపర్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రధానంగా ఉన్నా నేత కార్మికులు, వస్త్రోత్పత్తి దారులకు మాత్రం బడ్జెట్ నిరాశే కలిగించింది. దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్న మెగా పవర్‌లూం క్లస్టర్ ఈసారి కూడా నేతన్నకు అందని ద్రాక్షే అన్నట్లుగా మిగిలిపోయింది. కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.200 కోట్లకు పరిమితం చేశారు. టెక్స్‌టైల్ రంగానికి రూ.5272 కోట్లు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు, పరిశ్రమకు ఎంతవరకు ఊరటనిస్తుందనే లెక్కలు కొంత అయోమయానికే గురిచేస్తున్నాయి. 2013 కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి ప్రస్తుతం 2025-26 కేంద్ర బడ్జెట్ వరకు ప్రతి సంవత్సరం మెగా పవర్‌లూం క్లస్టర్ వస్తుందని భావించారు. గత సంవత్సరం బడ్జెట్ ఓటాన్ అకౌంట్ కావడంతో సిరిసిల్ల నేత కార్మికులు ఆశలు పెంచుకోలేదు. ఈసారి ఆశలు నేరవేరుతాయని భావించినా నిరాశే కలిగింది.







పేద పిల్లల కోసం అటల్ టింకరింగ్ ల్యాబ్స్

పేద విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇన్వెస్టింగ్ ఇన్ పీపుల్ మిషన్ తీసుకొచ్చింది. ఈ పథకంలో రాబోయే ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తారు. అన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించనున్నారు.

- వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 75 వేల కొత్త మెడికల్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి.

వ్యవసాయానికి ఊతం

- కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి రూ. మూడు లక్షల నుంచి ఐదు లక్షలకు పెంపు
- ప్రధాన మంత్రి ధన్ ధాన్య యోజన కింద వెనకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం
- కందులు, మినుములు కొనుగోలు చేయనున్న కేంద్రం
- పండ్లు, కూరగాయల ఉత్పత్తికి నూతన పథకం
- పత్తి ఉత్పాదకత పెంచేందుకు జాతీయ స్థాయిలో ప్రత్యేక మిషన్
- దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు
- జల్ జీవన్ మిషన్ కిందరక్షిత మంచినీరు సరఫరా



వేతన జీవులకు ఊరట...

వేతన జీవులకు పన్నుల చెల్లింపుదారులకు కేంద్ర బడ్జెట్ ఊరటను ఇచ్చింది. ఉద్యోగులు, ట్యాక్స్ పేయర్లు ఈసారి రూ.10లక్షల వరకు మినహాయింపు లభిస్తుందని భావించగా ఏకంగా రూ.12 లక్షలకు స్లాబ్‌లు పెరగడం హర్షం వ్యక్తం అవుతోంది. పేద, మధ్య తరగతి ప్రజలకు పన్నుల రూపంలో రూ.80 వేల వరకు ఆదా కానున్నాయి. దీంతో పాటు రూ.20 లక్షల నుంచి రూ.24 లక్షల వరకు 25 శాతం, రూ.16 లక్షల నుంచి రూ.20 లక్షలలోపు ఆదాయంపై 20శాతం పన్ను స్లాబ్‌లను నిర్ణయించారు. స్లాబ్ రేట్లు కొంత ఉపయోగకరంగా కూడా ఉన్నట్లుగా భావిస్తున్నారు.

వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం

కేంద్ర బడ్జెట్ ఈసారి కూడా వ్యవసాయ రంగానికి ప్రోత్సాహాన్ని అందించే దిశగానే ఉంది.

మిగతా 10వ పేజీలో

- **తగ్గేవి:**
  - క్యాన్సర్ మందులు
  - ప్రాణాలను రక్షించే మందులు
  - ఫ్రోజెన్ చేపలు
  - ఎల్‌సీడీ, ఎల్ఈడీ టీవీలు
  - దేశంలో తయారైన దుస్తులు
  - మొబైల్ ఫోన్లు
  - లెదర్ వస్తువులు
  - వైద్య పరికరాలు
- **పెరిగేవి:**
  - ఫ్లాట్ ప్యానెల్ డిస్‌ప్లే, - సిగరెట్లు



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో మొండి చేయి..

- తెలంగాణను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రాన్ని మరోసారి విస్మరించిందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. శనివారం కేంద్ర బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ కేటాయింపుల్లో మరోసారి రాష్ట్రానికి నిరాశే ఎదురైందని, అన్ని వర్గాలను ఈ బడ్జెట్ నిరాశపరిచిందన్నారు. రాజీవ్ గాంధీ, పి.వి. నరసింహారావు, డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రులుగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లు దేశాన్ని మరోస్థాయికి తీసుకెళ్లాయని అభిప్రాయపడ్డారు. గత పది సంవత్సరాలతోపాటు ప్రస్తుత బడ్జెట్ పూర్తిగా విఫలమై దేశపురోగతిని అడ్డుకున్నాయన్నారు. ప్రజలను గందరగోళపర్చడమే ప్రధానమంత్రి మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లక్ష్యమని ఈ బడ్జెట్‌తో స్పష్టమైందన్నారు. పేదలు, యువత, రైతులు, మహిళలు ఈ నాలుగు వర్గాలను అభివృద్ధి ఇంజన్‌లుగా పేర్కొన్న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చెప్పిన నాలుగు వర్గాలకు పూర్తిగా నిరాశనే మిగిల్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 8 మంది బీజేపీ పార్లమెంటు సభ్యులు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా సాధించింది సున్నా అని, కేవలం ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో వరాలు ప్రకటించి, ఎన్నికలు లేని రాష్ట్రాలపై వివక్ష చూపడం సరికాదన్నారు. మొదటి నుంచి కేంద్ర ప్రభుత్వం ఇదే దోరణిని ప్రదర్శిస్తూ రాజకీయ అవసరాలు తీర్చుకుంటున్నదని దుయ్యబట్టారు. ఢిల్లీ, బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర బడ్జెట్ తయారు చేసినట్టు ఉందన్నారు. ఐదు సార్లు బడ్జెట్‌లో బీహార్ అంశాలను ప్రస్తావించారనీ బడ్జెట్‌లో తెలంగాణ అంశం కానీ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు గురించి మాట్లాడ లేదని తెలిపారు. విభజన హామీలు, ట్రైబల్ యూనివర్సిటీ గురించి చెప్పలేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని బడ్జెట్‌లో నిర్లక్ష్యం చేశారని, తెలంగాణతో తమకు సంబంధం లేదని బడ్జెట్ ద్వారా కేంద్రం ప్రభుత్వం నిరూపించిందని ఆది శ్రీనివాస్ అన్నారు.

నీటి సరఫరా పరిశీలనకు ప్రత్యేక డ్రైవ్ : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరాలో లోపాలు తలెత్తకుండా మండల స్థాయి అధికారులు సరఫరాలను పరిశీలించేందుకు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో శనివారం జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఎన్ని కుటుంబాలు ఉన్నాయని, ఎన్ని నల్లాల కనెక్షన్‌లున్నాయనే వివరాలతోపాటు నీటిసరఫరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా జిల్లాలోని అన్నిగ్రామాల్లో నీటిసరఫరాను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాలని, మండలాల వారీగా పంచాయితీరాజ్, మిషన్ భగీరథ అధికారులతో బృందాన్ని నియమించాలని ఆదేశించారు. ఈనెల 12వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో నీటి సరఫరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను అందజేయాలని సూచించారు.

మలేరియా నివారణ చర్యలపై సమీక్ష

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ రజిత అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. అనంతరం జనవరి నెలలో మలేరియాపై నిర్వహించిన కార్యక్రమాలపై ప్రోగ్రాం ఆఫీసర్లు, మలేరియా ఎల్‌టీలు, మలేరియా సబ్‌యూనిట్ అధికారులతో సమీక్షించారు. సమావేశంలో వేములవాడ ఏరియాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, గైనకాలజిస్ట్ డాక్టర్ లీలాశిరీషా, ప్రోగ్రాం ఆఫీసర్లు, మలేరియా ఎల్‌టీలు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఆపరేషన్ ముస్కాన్..

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా పూర్తయిందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 11వ ఆపరేషన్ ముస్కాన్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 31మంది పిల్లలను రెస్క్యూ చేసి గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించామన్నారు. 18ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకొని వారితో పనిచేయిస్తున్న 8మందిపై కేసులు నమోదుచేశామన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు రెండుసార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నెల రోజుల పాటు పోలీస్‌శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక, విద్య, తదితర శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక బృందాలుగా ఏర్పాటుచేసి విస్తృత తనిఖీలు నిర్వహించామన్నారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేయడానికి సహకరించిన అన్నిశాఖల జిల్లా అధికారులను ఎస్పీ అభినందించారు.

పులి దొరికిందన్న పుకార్లను నమ్మవద్దు

- రైతులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పులి దొరికిందన్న పుకార్లను నమ్మవద్దని జిల్లా అటవీశాఖ అధికారి బాలమణి అన్నారు. మండలంలో పులి సంచారం ఉందన్న సమాచారం మేరకు నూకలమర్రి గ్రామ శివారులో పలు ప్రాంతాలను సిబ్బందితో కలిసి శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం వేములవాడలోని అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్‌వో బాలమణి మాట్లాడుతూ పులి సంచారంపై గ్రామాల ప్రజలందరూ ఆందోళన చెందవద్దన్నారు. పొలాలకు వెళ్లే రైతులు అటవీశాఖ అధికారులు చెప్పిన సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. రాత్రి వేళల్లో రైతులు పొలాల దగ్గరకు వెళ్లకూడదన్నారు. మధ్యాహ్నం సమయంలోనైనా రైతులు ఒంటరిగా పొలాలకు వెళ్లకూడదన్నారు. పులి జాడ కోసం వేములవాడ ప్రాంతంలో మూడు బృందాలను ఏర్పాటు చేసామన్నారు. పులి సంచారంపై ఎలాంటి సమాచారం తెలిసినా 100కు ఫోన్ చేయాలన్నారు. ఎఫ్ఆర్వో ఖలీల్, ఎఫ్ఎస్ఓ అఫ్జల్, హుస్సేన్, అభిషేక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాసన మండలి ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై కలెక్టర్‌లతో వీడియోసమావేశం ద్వారా సమీక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈసందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ శాసన మండలి సభ్యుల స్థానానికి, ఉమ్మడి నల్గొండ ఖమ్మం వరంగల్ ఉపాధ్యాయుల స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. శాసనమండలి ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఈనెల3న విడుదలవుతుందని, 3నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటినీ, 13 లోపు ఉపసంహరణ గడువు ఉంటుందని, 27న పోలింగ్, మార్చి 3న ఫలితాలు ఉంటాయని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి తుది ఓటర్ల జాబితా తయారుచేయాలని, పెండింగ్‌లో ఉన్న టీచర్స్, పట్టభద్రుల ఓటర్లు దరఖాస్తులను పరిశీలించి ఫిబ్రవరి 7లోపు పరిష్కరించాలని సీఈవో అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి జిల్లాలో ఎంసీఎంసీ కమిటీలను వెంటనే ఏర్పాటుచేసి పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మీడియాలలో వచ్చే ప్రసారాలను పరిశీలించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు కట్టుదిట్టంగా జరగాలని, ఎక్కడా ఎటువంటి అలసత్వం ఉండటానికి వీలు లేదన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ అవసరమైన వసతులు కల్పించాలని, ఈనెల27 ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేసి సన్నద్ధంగా ఉండాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్ మెదక్ నిజామాబాద్ జిల్లాల పట్టభద్రులు టీచర్స్ స్థానాలకు సంబంధించిన నామినేషన్ కరీంనగర్ కలెక్టరేట్‌లో, ఉమ్మడి నల్గొండ ఖమ్మం వరంగల్ టీచర్స్ స్థానానికి సంబంధించిన నామినేషన్ నల్గొండ కలెక్టరేట్లో స్వీకరించడం జరుగుతుందని, దీనికి అనుగుణంగా అక్కడ అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి 28 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 22 వేల 473 మంది ఓటర్లు, ఉపాధ్యాయులకు సంబంధించి 13మండలాల పరిధిలో 928మంది ఓటర్లున్నారని తెలిపారు. ప్రస్తుతం అధికారుల వద్ద 149 పట్టభద్రులు, 40 ఉపాధ్యాయుల ఓటర్ నమోదు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పరిశీలించి సకాలంలో పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళికు సంబంధించిన నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 7పోలింగ్ కేంద్రాలను పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు కామన్‌గా ఏర్పాటుచేశామన్నారు. పట్టభద్రులకు ప్రత్యేకంగా 32 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా 6 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారులు రాధాబాయి, రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మార్కండేయ స్వామి శోభాయాత్ర



సిరిసిల్లలో మార్కండేయ స్వామి శోభాయాత్ర



శోభాయాత్రలో పద్మశాలి సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విఠలా... విఠలా.. పాండురంగా అంటూ శివభక్త మార్కండేయస్వామి నామస్మరణతో శోభాయాత్ర కన్నుల పండుగగా సాగింది. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ శివభక్త మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీమార్కండేయ స్వామి దేవస్థానంలో స్వామివారి మహాయజ్ఞం నిర్వహించారు. సాయంత్రం పద్మశాలీలు, మహిళల జనసందోహం మధ్య వైభవోపేతంగా మార్కండేయ స్వామి శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై మార్కండేయ స్వామి ఉత్సవ విగ్రహంతో మార్కండేయ దేవస్థానం నుంచి బయలుదేరిన యాత్ర గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా, చేనేత చౌక్, పెద్దబజార్ మీదుగా వెంకటేశ్వర స్వామి దేవాలయం మీదుగా కొనసాగింది. శోభాయాత్రకు తరలివచ్చిన పద్మశాలీలు, మార్కండేయ స్వామి భక్తులు అడుగడుగునా నృత్యాలు చేస్తూ మార్కండేయ నామ స్మరణ చేశారు. శోభాయాత్రలో పద్మబ్రహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రలో గాంధీ, అంబేద్కర్, నేతన్న విగ్రహాలకు పూలమాలలు వేశారు. జయంతి ఉత్సవాలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, కార్యదర్శి మండల సత్యం, జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ ,పవర్‌లూం టెక్స్‌టైల్ కార్పొరేషన్‌మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ అడెపు రవీందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, చేనేత వస్త్రవ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్, పద్మశాలి మహిళ సంఘం అధ్యక్షురాలు కాముని వనిత,కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పద్మశాలి సంఘం ప్రతినిధులు బొల్లి రామ్మోహన్, డాక్టర్ గాజుల బాలయ్య, యెల్లె లక్ష్మీనారాయణ, మ్యాన రవి, మోర రవి, వెల్దండి దేవదాస్, గుజ్జెతార, అడెపు చంద్రకళ, దార్నం అరుణ, కట్టెకోల లక్ష్మీనారాయణ, పిస్క మధు, వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేటలో సాయంత్రం ఊరేగింపు చేపట్టారు. రాజీవ్‌నగర్‌లో మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలతో పాటు మహాయజ్ఞాన్ని నిర్వహించారు. తాజా మాజీ కౌన్సిలర్లు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు బొప్పాపూర్, గొల్లపల్లి తదితర గ్రామాల్లోని వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం- గౌస్, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, వైద్యుడు సత్యనారాయణస్వామి, తాజా మాజీ ఎంపీటీసీ నాగరాణి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారిశోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బాబు, పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దేవాంతం, ప్రధానకార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షులు దేవదాస్, సుదర్శన్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, నాయకులు మోర శ్రీహరి, మచ్చ ఆంజనేయులు, మోర రాజు, మచ్చ శ్రీనివాస్, సామల రమేష్, లింగాల భూపతి, అంకారపు రవీందర్, మోర లక్ష్మీరాజం,అంకారపు మహేష్, పెద్దూరి తిరుపతి, మునిగేలా రాజు, గుగ్గిళ్ల భరత్‌గౌడ్, బొడ్డు పరశురాములు, చేన్నవేణి ప్రశాంత్ పాల్గొన్నారు.

● గంబీరావుపేట : మండలకేంద్రంలో వేడుకలు నిర్వహించారు. పద్మశాలి సంఘం నాయకులు యెల్లె బాలకృష్ణ, యెల్లె దేవేందర్, శ్రీగాధ గణేష్, యెల్లె దేవేందర్, ఇప్పకాయల దేవయ్య, దేవసాని రమేష్, తుమ్మ రామచంద్రం, అన్నం నరేష్, గంగుల సత్యనారాయణ, యెల్లె గోపి, యెల్లె బంటి, ఇప్పకాయల దేవేందర్ తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కుంకుమ పూజ నిర్వహించి మహిళలకు మాజీ ఏంపీటీసీ లావణ్య రాజేశం మంగళహారతి ప్లేట్స్, జ్ఞాపికలను అందజేశారు. పిల్లమారపు గంగాధర్‌పద్మ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షులు భాసని ఓం ప్రకాష్, మంచె రమేష్, పిల్లమారపు ప్రవీణ్, పులి రాజేష్, పద్మశాలి సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో శనివారం హోమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని పూజలు నిర్వహించారు. నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు చేపూరి గంగాధర్, ఫిరోజ్‌పాషా, నందుగౌడ్, నాయిని ప్రభాకర్‌రెడ్డి, రమేష్ రెడ్డి, గొట్టె రుక్మిణి, నిత్యానందం తదితరులు ఉన్నారు.



కోనరావుపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్

పురుగుల మందుతాగిన వైద్య విద్యార్థిని

- చికిత్సపొందుతూ మృతి
- తోటి పీజీ విద్యార్థిపై అనుమానం..
- మృతురాలి తండ్రి ఫిర్యాదు
- కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నాం: పోలీసులు



ఆర్పిసాహ మృతదేహం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని ప్రతిమ మెడికల్ కళాశాలలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మెడికో ఆర్పి సాహు (27) రెండు రోజుల కిందట పురుగుల మందు తాగగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందింది. కరీంనగర్‌రూరల్ పోలీసులు, మృతురాలి తండ్రి ఫిర్యాదు వివరాల ప్రకారం.. హైదరాబాద్ నాంపల్లికి చెందిన ఆర్పి సాహు(27) కరీంనగర్ ప్రతిమ మెడికల్ కాలేజీలో పీజీ వైద్య విద్యనభ్యసిస్తోంది. అదే కళాశాలలో పీజీ సివిల్ సర్జన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆశిశ్‌తో రెండు నెలల క్రితం గొడవ జరిగింది. ఆ తరువాత కూడా ఎప్పుడూ ఆర్పి సాహును కోప్పడేవాడు. జనవరి 28న ఆశిశ్ తన బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు తనఇంటిలో విందు ఇచ్చాడు. ఈవిందుకు ఆర్పిసాహు మినహా అందరూ హాజరయ్యారు. దీంతో అతడు నీవెందుకు రాలేదంటూ కోప్పడ్డాడు. దీంతో ఆమె ఒంటరిగానే 29న ఆశిశ్ ఇంటికి వెళ్లివచ్చింది. ఆ మరుసటి రోజు జనవరి 30న మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో ప్రతిమ వైద్యకళాశాల హాస్టల్‌లో ఆమె పురుగుమందుతాగింది. వాంతులు అవుతున్నాయని రూమ్‌మేట్ భావనకు తెలిపింది. వాంతులు ఎక్కువ అవటంతో రాత్రి 8గంటలకు ఆమె రూమ్‌మేట్ ప్రతిమవైద్యకళాశాలలో చేర్పించి చికిత్స అందించారు. అనంతరం జరిగిన విషయాన్ని భావన ఆర్పిసాహు సోదరికి ఫోన్‌లో తెలియజేసింది. చికిత్స అనంతరం ఆర్పిసాహు హాస్టల్ గదికి వచ్చింది. మరుసటిరోజు జనవరి 31న ఆర్పిసాహుకు వాంతులు, విరేచనాలు ఎక్కువ య్యాయి. మళ్ళీ ప్రతిమ ఆసుపత్రిలో చికిత్సకోసం చేర్పించారు. విషయం తెలుసుకున్న ఆర్పిసాహు తండ్రి, అతని కొడుకు, మరో కూతురు ప్రతిమ ఆసుపత్రికి వచ్చి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. మెరుగైనచికిత్స కోసం సాయంత్రం 6గంటలకు కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చేర్పిం చారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం 1:55గంటలకు ఆర్పిసాహు మృతిచెందింది. తన కూతురు ఆత్మహత్యకు ఆశిశ్‌పై అనుమానం ఉందని మృతురాలి తండ్రి రాజేంద్రసాహు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

వీణవంక, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపల్లి గ్రామానికి చెందిన నామిని ఉమాదేవి(30) అనేమహిళ అప్పులబాధతో ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ తోట తిరుపతి, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నామిని ఉమాదేవి-శ్రీనివాస్ దంపతులు మూడేళ్ల క్రితం రూ. 20లక్షలు అప్పు చేసి ఇల్లు కట్టారు. వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నారు. పంట దిగుబడి సైతం సరిగ్గా రాకపోవడంతో అప్పుతీర్చే దారి తెలియకపోవడంతో మనస్తాపానికి గురై ఉమాదేవి పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలు ఉమాదేవి భర్త నామిని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్త శివారులో మహిళను ద్విచక్రవాహనం వెనుకనుంచి ఢీకొట్టడంతో మహిళకు గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్త గ్రామానికి చెందిన ఎల్కపల్లి నర్సమ్మ తమ వ్యవసాయబావి వద్ద నుంచి ఇంటికి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తోంది. శంకరపట్నం మండలం ముత్తారం గ్రామానికి చెందిన బండ పరుశరాములు తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి నర్సమ్మను వెనుక నుంచి ఢీకొట్టింది. నర్సమ్మకు గాయాలు కాగా స్థానికులు 108 వాహనం ద్వారా ఆస్పత్రికి పంపినట్లు తెలిపారు.

గూడు లేక... రాత్రంతా అంబులెన్స్‌లోనే మృతదేహం..



అంబులెన్స్‌లో సంతోష్ మృతదేహం, విలపిస్తున్న భార్య, పిల్లలు

ముస్తాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఇల్లు కూలిపోగా.. అద్దె ఇంటికి వెళ్లలేక.. రాత్రంతా మృతదేహంతో అంబులెన్స్‌లో గడిపిన హృదయవిదారక సంఘటన ముస్తాబాద్ మండలకేంద్రంలో చోటు చేసుకుంది. ముస్తాబాద్‌కు చెందిన బిట్ల సంతోష్(48) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. స్వంతఇల్లు శిథిలావస్థలో ఉండడంతో కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి సంతోష్ పరిస్థితి విషమించడంతో స్థానిక ప్రైవేటుఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. దీంతో అద్దె ఇంటికి తీసుకెళ్లలేక స్వంత ఇంటి వద్దకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. అయితే ఇంట్లోకి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో రాత్రంతా అంబులెన్స్‌లో మృదేహాన్ని ఉంచారు. పుట్టెడు దుఃఖంతో భార్య, ముగ్గురు పిల్లలు, బంధువులు చలిలో గడిపారు. శనివారం తెల్లావారు జామున కూలిపోయిన ఇంటిని కొంత శుభ్రం చేసి మృతదేహాన్ని ఉంచారు. అనంతరం అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించారు. అంత్యక్రియలకోసం చిట్నేని వెంకటేశ్వర్‌రావు రూ.11 వేలు, మాజీఎంపీపీ జనగామ శరత్‌రావు రూ.5వేలతోపాటు పలువురు దాతలు స్పందించి దాదాపు రూ.40వేలు పోగు చేసి అందించారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



కొండగట్టు ఆలయంలో డీజీపీ జితేందర్ దంపతులు

మల్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానంలో శనివారం భక్తులతో రద్దీనెలకొంది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారినిదర్శించుకొని మొక్కులుతీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకపూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● డీజీపీ జితేందర్ ప్రత్యేక పూజలు

డీజీపీజితేందర్ శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయానికివచ్చిన డీజీపీకి ఆలయ అధికారులు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు జరిపారు. అనంతరం ఈవో కృష్ణ ప్రసాద్ స్వామివారి చిత్రపటం బహూకరించారు. ఎస్పీ అశోకకు మార్, డీఎస్పీ రఘుచందర్, ఆర్‌ఐ కిరన్‌కుమార్, సీఐ నీలం రవి, ఎస్సైలు సతీష్, రవికుమార్ పాల్గొన్నారు.

- నిధులు మంజూరైనా మొదలు కాని పనులు
- వర్షాకాలం వచ్చిందంటే కోండ్రికర్ల గ్రామస్థుల తీవ్ర ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడో?



బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని కోండ్రికర్ల గ్రామ శివారులోని వాగుపై వంతెన లేక వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి అవతలివైపు ఉన్న కోనరావుపేట, కథలాపూర్, వేములవాడ వైపు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే. వర్షాకాలంలో వాగు ప్రవహించినప్పుడు గ్రామానికి మిగితా ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతున్నాయి. వాగులో నీటి ప్రవాహం లేని సమయంలో ప్రతి ఏటా గ్రామ పంచాయతీ



కోండ్రికర్ల వాగులో చిక్కుకున్న రైతులను దాటిస్తున్న గ్రామస్థులు(ఫైల్)

నిధులతో తాత్కాలికంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేసుకున్నా అది కొట్టుకుపోతోంది. గ్రామానికి చెందిన వందల ఎకరాల వ్యవసాయ భూములు వాగుకు అవత లివైపు ఉన్నాయి. వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు, రైతులు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. తాజాగా మాన్సూర్ నుంచి గోదావరిలోకి నీరు వదలగా వాగులో ఉధృతంగా నీరు ప్రవహించడంతో ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు తిరిగి గ్రామానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు, రైతులు నీటి ప్రవాహం వద్ద నిలబడి నిరసన తెలిపారు.

● 2023లో పనులకు శంకుస్థాపన

ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బ్రిడ్జి నిర్మాణం ఓ హామీగానే మిగిలిపోతోంది. గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎంపీటీసీగా బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే బ్రిడ్జి కట్టిస్తానని గ్రామస్థులకు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు బాండ్ పేపర్ రాసిచ్చారు. వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయడానికి సీఆర్‌ఆర్ నుంచి రూ. 4కోట్ల నిధులు మంజూరు చేయించారు. 2023 ఆగస్టులో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా ఆయన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించేందుకు ముందుకు రావడం లేదు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

-ఆకుల శ్రీనివాస్, కోండ్రికర్ల మాజీ సర్పంచ్



గ్రామ శివారులోని వాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాకాలం గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని రైతుల భూములు ఎక్కువగా వాగు అవతలవైపు ఉన్నాయి. నీరు ప్రవాహిస్తే పొలం పనులకు వెళ్లడానికి నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి వాగుపై బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టాలి.

వాహనం నుంచి జారిపడి చిన్నారి మృతి



స్పందన(ఫైల్)

గొల్లపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన పురాణం స్పందన(7) అనేచిన్నారి శనివారం పాఠశాల నుంచి వస్తూ వాహనంపై నుంచి పడి మృతిచెందింది. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గుంజపడుగు గ్రామానికి చెందిన పురాణం లత-రవీందర్ దంపతుల రెండో కుమార్తె స్పందన ని చిల్వాకోడూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. ప్రతిరోజు లాగే వాహనంలో ఐదుగురు చిన్నారులను స్కూల్ నుంచి ఎక్కించుకుని డ్రైవర్ ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. గోవిందుపల్లె బస్టాండ్ సమీపంలోకి రాగానే వాహనంలోంచి రోడ్డుపై పడ్డ స్పందన తలకు బలంగా దెబ్బతగిలి అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు వ్యవసాయంలో నష్టాలు.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు.. దీంతో చేసిన అప్పులు తీర్చలేక మనస్థాపం చెందిన ఓరైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరా ల్లోకి వెళితే.. మండలంలోని నర్సక్కపేట గ్రామానికిచెందిన తిప్పరవేని శ్రీనివాస్ (45) అనేరైతు తనకున్న20 గుంటలతోపాటు గ్రామంలో మరో 5ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగుచేస్తున్నాడు. ప్రతి సంవత్సరం ప్రత్తి నష్టాలు మిగుల్చుతుండటంతో కుటుంబాన్ని పోషించుకోవడానికి సమయం దొరికినప్పుడు శ్రీనివాస్ ఇతర పనులు చేసేవాడు. అయినా రూ.10లక్షల వరకు అప్పులు అయ్యాయి. దీంతో అప్పులు ఎలాతీర్చాలని మనస్తాపం చెందాడు.. శనివారం ఉదయం బావివద్ద ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య దేవలక్ష్మి, కుమారుడు సాగర్, కుమార్తె సంధ్య ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

దేవుడి దయతోనే క్షేమంగా తిరిగి వచ్చాం

- కుంభమేళాలో తప్పిపోయి ఇంటికి వచ్చిన జగిత్యాల మహిళలు



వివరాలు వెల్లడిస్తున్న మహిళలు

జగిత్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాలో తప్పిపోయి దేవుడిదయతో తిరిగి క్షేమంగా ఇంటికి చేరామని జగిత్యాల విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ, కొత్తవాడ కాలనీకిచెందిన ఆది రాజవ్వ, నిర్మల్ జిల్లా కడెంకు చెందిన ఏనుగుల బుచ్చవ్వ, బెల్లపు సత్తవ్వ అన్నారు. కుంభమేళా నుంచి జగిత్యాలలో తమ నివాసానికి శనివారం వారు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. జగిత్యాల నుంచి వాహనం అద్దెకు తీసుకుని తాము వారణాసికి వెళ్లామన్నారు. జనవరి 27న కాశీ సమీపంలోని ఆలయాలను దర్శించుకుని కుంభమేళాకు బయలు దేరామని తెలిపారు. కుబేర అనే ఘాట్‌కు చేరుకున్నాక ట్రాఫిక్ విపరీతంగా ఉండడంతో వాహనం దిగి రెండుఆటోల్లో ఐదుకిలోమీటర్లు దూరం వరకు ప్రయాణించామన్నారు. అక్కడినుంచి వేరేఆటోలో మరో ఐదుకిలోమీటర్లు ప్రయాణించామని తెలిపారు. ఆ స్థలం నుంచి వాహనాలు ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో అక్కడివారి సూచన మేరకు ద్విచక్రవాహనాలపై ప్రయాణించామన్నారు. ఘాట్ సమీపంలోకి వెళ్లిన తర్వాత తాము ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాలు ఒక వైపునకు, మిగిలిన వాహనాలు మరో వైపునకు వెళ్లాయన్నారు. దీంతో తాము తప్పిపోయామని గ్రహించామన్నారు. తమ వద్ద డబ్బులు, ఫోన్లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. తమతో వచ్చిన వారు ఎక్కడైనా కనిపిస్తారేమోనని ఒక రోజంతా వెతికామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు ప్రాంతానికి చెందిన తెలుగు వారు కనబడి తమ పరిస్థితి తెలుసుకుని రైలు టికెట్ కొనిచ్చి, రెండు వేల రూపాయలు ఇచ్చారన్నారు. రైలులో వరంగల్ వరకు వచ్చి అక్కడి నుంచి బస్సులో క్షేమంగా ఇంటికి చేరుకున్నామన్నారు. తమకు సాయం అందించిన నెల్లూరువాసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కాశీ విశ్వనాథుడి దయతోనే తాము క్షేమంగా ఇంటికి వచ్చామని నలుగురు మహిళలు తెలిపారు.

దేశ గతిని మార్చే అద్భుతమైన బడ్జెట్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



కరీంనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశగతిని మార్చే అద్భుతమైన బడ్జెట్ అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆయన కేంద్రబడ్జెట్‌పై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. పేద, మధ్యతరగతి, యువత, రైతుసంక్షేమ బడ్జె ట్‌ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారన్నారు. 12లక్షల రూపాయల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మకమైనచర్య అన్నా రు. తెలంగాణ సహా దేశంలోని ఒక్కో ఉద్యోగికి 80 వేల రూపాయల వరకు ఆదా అవుతుందన్నారు. గత 75సంవత్సరాల్లో మునుపెన్నడూ లేని విధంగా మధ్య తరగతి ప్రజలకు అనుకూలమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. తెలంగాణలో యాభైలక్షల రైతులకు ఐదు లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. కిసాన్‌క్రెడిట్ కార్డుల కోసం రైతులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2027 నాటికి అమెరికా, చైనా తరువాత మూడో ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించే దిశగా బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. పత్తి, పప్పు దినుసులు పండించే రైతులకు లాభదాయకమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. ఇది సంక్షేమ బడ్జెట్ అని పేద ప్రజల పెన్నిధిగా మోదీ మరోసారి నిరూపించుకున్నారన్నారు. టీవీ, మొబైల్స్, లెదర్, ఉత్పత్తుల ధరలు భారీగా తగ్గుతాయని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలపై ధరలు తగ్గడంతో కాలుష్యం తగ్గే అవకాశముందన్నారు. కేన్సర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు వాడుతున్న ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని భారీగా తగ్గిండంతో ఆయా రోగులకు చికిత్స వ్యయం తగ్గుతుందని చెప్పారు. 7.7 కోట్ల మంది రైతులకు ఐదు లక్షల రూపాయల వరకు బ్యాంకుల ద్వారా క్రెడిట్ (రుణం) లభించే అవకాశముందన్నారు. ప్రైవేట్ వ్యాపరులు, దళారుల వద్ద చేయి చాచే దుస్థితి లేకుండా కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టారన్నారు. బడ్జెట్‌లో వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులు ఔత్సాహిక యువ పారిశ్రామిక వేత్తలు వ్యాపారులకు రుణ పరిమితిని పెంచడం ఆహ్వానించదగ్గ పరిణామమని తెలిపారు. ఎంఎస్ఎంఈ రుణాలను ఐదుకోట్ల నుండి 10కోట్లకు పెంచడంతోపాటు స్టార్టప్‌లకు 20కోట్ల వరకు రుణాలివ్వడం ద్వారా యువతకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

పట్టణాభివృద్ధికి నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిలో తెలంగాణ ప్రభుత్వం భాగస్వామి కావాలన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశగతిని మార్చబోతుందన్నారు. దేశంలోని 90శాతం పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలను అభివృద్ధిని కాంక్షిస్తు రూపొందించిన బడ్జెట్ చరిత్రలో నిలిచి పోతుందన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రం లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని కోనేటి మల్లేశం(46) హమాలీ పనులు చేస్తుండేవాడు. ఉపాధినిమిత్తం రూ.2లక్షలు అప్పులుచేసి కొడుకు రాజ్‌కుమా ర్‌ను ఇటీవల గల్ఫ్ దేశానికి పంపించాడు. కుటుంబ పోషణ, బాకీల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు చోటుచేసుకున్నాయి.

ఈ క్రమంలో మల్లేశం భార్య అంజవ్వ రెండు రోజుల కిందట పుట్టింటికి వెళ్లింది. దాంతో మనస్థాపం చెందిన మల్లేశం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గదినుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

జాతీయ స్థాయిలో నంబర్ వన్‌గా నిలవాలి

- ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి పోలీస్‌క్రీడలు ● డీజీపీ డాక్టర్ జితేందర్ ● రాష్ట్ర పోలీస్‌క్రీడల్లో ఓవరాల్ చాంపియన్‌గా హైదరాబాద్ కమిషనరేట్
- ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు



మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

కరీంనగర్ స్పోర్ట్స్ ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోలీస్‌క్రీడల్లో రాష్ట్రజట్లు నంబర్‌వన్‌గా నిలవాలని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్ మైదానంలో కరీంనగర్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న మూడవ రాష్ట్రస్థాయి పోలీస్‌క్రీడలు శనివారం ముగిశాయి. ఈముగింపు కార్యక్రమానికి డీజీపీ జితేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టగ్‌ఆఫ్‌వార్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. మ్యాచ్ అనంతరం క్రీడాకారుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరించారు. అనంతరం వివిధపోటీల్లో విజేతల జట్లకు చాంపియన్‌షిప్ ట్రోఫీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తిని కలిగిఉండాలన్నారు. క్రీడాకారులకు గెలుపు ముఖ్యంకాదనిపోటీల్లో పాల్గొనడమే ముఖ్యమన్నారు. పోలీస్ క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రతిసంవత్సరం రాష్ట్రస్థాయి పోలీస్‌క్రీడలను నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా పోటీలను ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి నిర్వహించిన సీపీ అభిషేక్ మొహంతిని అభినందించారు. మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలన్నారు. ఐజీ స్పోర్ట్స్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ నిత్యజీవితంలో క్రీడలను ఒకభాగంగా చేసుకొని ఆరోగ్యవంతులుగా ఎదగాలన్నారు. కరీంనగర్ కమిషనరేట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోలీస్‌క్రీడలను ఘనంగా నిర్వహించారని అందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి మాట్లాడుతూ ఈ సంవత్సరం రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించే అవకాశాన్నిచ్చిన డీజీపీకి ధన్యవాదాలు తెలిపారు. 20జోన్ల నుంచి 2300 మంది క్రీడాకారులు 27క్రీడాంశాల్లో పోటీపడ్డారని పేర్కొన్నారు. పోటీల విజయవంతానికి తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాలఎస్పీ అశోక్‌కుమార్, రాజన్నసిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్, కరీంనగర్ ఏసీపీ ఏ లక్ష్మీనారాయణ, కరీంనగర్ ఏఎస్పీ శుభం ప్రకాశ్, తెలంగాణ స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు, ట్రైనీ ఐపీ ఎస్ వసుంధర యాదవ్, కరీంనగర్ ఏసీపీ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన హైదరాబాద్ కమిషనరేట్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీజీపీ జితేందర్



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న పోలీసు క్రీడాకారులు

● ఓవరాల్ చాంపియన్ హైదరాబాద్ కమిషనరేట్..

మూడవ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్‌క్రీడల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్ కమిషనరేట్ జట్టు కైవసం చేసుకుంది. వివిధ క్రీడాంశాల్లో తమ ప్రతిభను చాటిన హైదరాబాద్ కమిషనరేట్ క్రీడాకారులు వ్యక్తిగత పోటీల్లో సైతం ప్రతిభను చాటి రాష్ట్ర చాంపియన్లుగా నిలిచారు. అలాగే ద్వితీయస్థానంలో టీజీఎస్‌బి-1రేంజ్ క్రీడాకారులు నిలిచారు. అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్స్‌గా రాచకొండ కమిషనరేట్ నిలిచింది. పురుషుల చాంపియన్‌షిప్‌ను టీజీఎస్‌బి-1రేంజ్ సాధించగా, మహిళల విభాగంలో రాచకొండ కమిషనరేట్ చాంపియన్‌షిప్‌లను సాధించాయి. వ్యక్తిగత విభాగంలో చాంపియన్‌షిప్‌ను పురుషుల విభాగంలో భద్రాద్రి జోన్ క్రీడాకారుడు వంశీకృష్ణ సాధించగా, మహిళల విభాగంలో హైదరాబాద్ కమిషనరేట్‌కు చెందిన కే రోజా సాధించింది. బాక్సింగ్‌లో చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్ కమిషనరేట్ సాధించగా, ద్వితీయ స్థానంలో టీజీఎస్‌బి-1రేంజ్ నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన వినోద్‌పోటీల మొత్తంలో ఉత్తమ బాక్సర్‌గా ఎంపికయ్యాడు. వీరందరికీ డీజీపీ డాక్టర్ జితేందర్ ట్రోఫీలను ప్రదానం చేశారు.

55.85% బీసీలు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన వివరాలతో నివేదికను రూపొందించారు. సమగ్ర కుల సర్వే వివరాల నివేదికను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రివర్గ ఉపసంఘానికి అధికారులు అందజేయనున్నారు. ఆ నివేదికపై ఉపసంఘం అధ్యయనం చేయనుంది. 5న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అదే రోజు మధ్యాహ్నం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి, బీసీల రిజర్వేషన్లపై ఒక తీర్మానం చేసి.. దాన్ని కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ మేరకు బీసీల రిజర్వేషన్లను పెంచేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మేరకు రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు మించకుండా, న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉండేలా ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. కాగా, మార్చి 20 నాటికి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిశగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ చేపడుతోంది. కుల సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరనుండడంతో ఎన్నికల అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

బీసీ కమిషన్.. కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్..



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం, సురేఖ, ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, ఏఐ బలరాం

తెలంగాణ ఏర్పాటైన తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సర్వే చేపట్టింది. దాని ప్రకారం 2014లో బీసీలు 51శాతం, ఓసీలు 21, ఎస్సీలు 18, ఎస్టీలు 10 శాతం ఉన్నట్టు తేలింది. కానీ, ఈ సర్వేను అధికారికంగా విడుదల చేయలేదు. మళ్లీ 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇటీవల సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో కులం, మతం సహా అన్ని వివరాలను సేకరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో ఎంతమేర రిజర్వేషన్లను కల్పించాలనే అంశంపై ప్రభుత్వం ఈ సర్వేను వినియోగించుకోనుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల ఖరారు కోసం సర్కారు బీసీ కమిషన్‌తో పాటు, ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. ప్రత్యేక కమిషన్ కూడా బీసీల రిజర్వేషన్లపై లోతుగా అధ్యయనం చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిసింది. సర్వే వివరాలు, ప్రత్యేక కమిషన్ సూచనలను పరిగణనలోకి తీసుకొని.. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం తీసుకోనుంది.

మంత్రులతో సీఎం భేటీ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్లో భేటీ అయ్యారు. బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ మీడియాతో మాట్లాడారు. పొన్నం మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే, బీసీ కులగణనపై శాసనసభలో తీర్మానం చేసి, ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. కులగణన కార్యరూపం దాల్చే అంశంపై సీఎం చర్చించారని తెలిపారు. దీంతోపాటు ఎస్సీ వర్గీకరణపై సబ్‌కమిటీ తీసుకున్న నిర్ణయాలపైనా చర్చించామన్నారు. ఈ నెల 5న సబ్ కమిటీ ఇచ్చిన నివేదికను క్యాబినెట్ ముందు పెడుతున్నారని, అదే రోజు శాసనసభలో చర్చించి ప్రజాస్వామ్య యుతంగా ముందుకు తీసుకెళతామని చెప్పారు.

వర్గీకరణపై త్వరలో నివేదిక: రాజనర్సింహ

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రెండు గంటల్లోనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన చేశామని, వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దీనిపై ఇప్పటికే సానుకూలంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం వేశారన్నారు. ఉపసంఘం సూచన మేరకు ఏకసభ్య కమిషన్‌ను నియమించామని.. ఈ కమిషన్ త్వరలో నివేదిక ఇవ్వబోతోందని తెలిపారు. దానిపై మంత్రివర్గంలో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు.

వేతన జీవులకు ఊరట.. నేతన్నలకు నిరాశ..

(7వ పేజీ తరువాయి)

పీఎం ధన్‌ధాన్య యోజన ద్వారా వెనకబడిన జిల్లాలో వ్యవసాయానికి ప్రోత్సాహం అందే విధంగా బడ్జెట్ రూపొందించారు. గోదాంల నిర్మాణం నీటి పారుదల వ్యవస్థ ఆధునీకరణ, రుణసౌకర్యం రైతులకు కలుగుతుంది. కిసాన్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు.

మహిళలకు రుణాలపై ఆసక్తి

షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందిన మహిళలకు ఈసారి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. టర్మ్‌లోన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తొలిసారిగా వ్యాపారం ప్రారంభించుకునే వారికి వ్యాపారాలు విస్తరించుకునే మహిళలకు రూ.2కోట్ల వరకు రుణాలు అందించనుంది.

అంగన్‌వాడీలకు ఆధునిక హంగులు..

పోషణ 2.0లో భాగంగా అంగన్‌వాడీల్లో అధునాతన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన ఆహారాన్ని చిన్నారులకు, బాలింతలకు అందించనున్నారు. జిల్లాలో 587అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 40 వేల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో చిన్నారులు 17138 మంది ఉన్నారు. వీరికి మెరుగైన సేవలు అందనున్నాయి.

జిల్లాకు క్యాన్సర్ సెంటర్..

దేశంలోని అన్ని జిల్లా ఆసుపత్రుల్లో క్యాన్సర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. వచ్చే మూడేండ్లలో కేంద్రాల ఏర్పాటు పూర్తి చేస్తామని, ఈ సంవత్సరం 200 సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లా ప్రధాన ఆసుపత్రిలో క్యాన్సర్ కేంద్రం అందుబాటులోకి రానుంది.

గ్రామీణ ప్రాంత స్కూళ్లకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు

గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి తీసుకవస్తామని కేంద్రం ప్రకటించింది. ప్రభుత్వ స్కూళ్లలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో ఇప్పటికే అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఇవి మరింత పెరగనున్నాయి. వీటితో పాటు జిల్లాలో ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను విద్యారంగంలో తీసుకరావడం ద్వారా విప్లవాత్మక మార్పులు వస్తాయని భావిస్తున్నారు.

సామాన్య ప్రజలకు సానుకూల బడ్జెట్..

- ప్రతాప రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



కేంద్ర బడ్జెట్ సామాన్య ప్రజలకు రైతులకు సానుకూలంగా ఉంది. దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అంటూ తెలుగులో బడ్జెట్‌ను ప్రారంభించడం కృతజ్ఞత తెలియజేస్తున్నాం. మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని రూ.12 లక్ష వరకు ఆదాయపు పన్ను మినహాయింపు చేయడం ఎంతో ఉపశమనం, 82రకాల వస్తువులపై సెస్‌ను తొలగించారు. క్యాన్సర్‌కు సంబంధించిన 36రకాల మందులు చౌకగా లభించనున్నాయి.

బీజేపీ అంకెల గారడీ బడ్జెట్..

- గుంటి వేణు, సీపీఐ జిల్లా కార్యదర్శి



కేంద్ర బడ్జెట్ బీజేపీ ప్రభుత్వ అంకెల గారడీగా ఉంది. ఆదాయపు పన్ను రూ.12 లక్షల వరకు మినహాయింపు ఇస్తున్నట్లు మధ్యతరగతి ప్రజలను మభ్యపెడుతోంది. వాస్తవంగా రూ.12 లక్షల ఆదాయ పన్నుకు 5శాతం వసూలు చేస్తున్నారు. వ్యవసాయం, విద్యా, వైద్య రంగాలకు మొండి చేయి చూపించారు. గ్రామీణ పేదలకు ఉపాధి కార్మికులకు ఈ బడ్జెట్‌తో ఒరిగింది ఏమీలేదు. పారిశ్రామిక వేత్తలకు, సంపన్నులకు ఉపయోగపడే విధంగా కేంద్ర బడ్జెట్ ఉంది.

నిరుద్యోగులకు నిరాశకల్పించింది

- కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి



కేంద్ర ఆర్థిక మంత్రి నిరలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్ ప్రభుత్వ ఉద్యోగులకు ఊరటను కల్పించింది. నిరుద్యోగులకు నిరాశ కల్పించింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పింది. కేంద్ర బడ్జెట్‌లో సామాన్య మధ్యతరగతి ప్రజలకు ఎటువంటి లబ్ధి చేకూరలేదు. కేవలం ఆర్థిక మాటల గారడీ తప్ప దేశ ప్రజలకు ఒరిగింది ఏమీలేదు.

ప్రజా రంజకమైన బడ్జెట్..

- అల్లాడి రమేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సెస్ మాజీ చైర్మన్



కేంద్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆంక్షలకు ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తుంది. ప్రజారంజకమైన ఈ బడ్జెట్ ద్వారా పేద, మధ్యతరగతి, రైతు, యువత, ఎస్సీ ఎస్టీ మహిళలు, విద్య, ఐటీ రంగాలు 2027వరకు ప్రపంచంలోనే భారత్ మూడో స్థానం చేరుకునేలా ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మధ్య తరగతి ఉద్యోగస్థులకు, దేశవ్యాప్తంగా 75 వేల ఎంబీబీఎస్ సీట్లు, ఐఐటీ సీట్ల పెంపు.. ఇది వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశపెట్టారు.

వేతన జీవులకు ఊరట..

- పులి శ్రీనివాస్, ట్యాక్స్ ప్రాక్టిషనర్



కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు ఎంతో ఊర టను ఇస్తూ స్లాబ్‌లను నిర్ణయించింది. మధ్యతరగతి వారికి లాభదాయకంగా ఉంటుంది. రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపుతోపాటు కొత్త పన్ను విధానం వర్తింపజేశారు. స్టాండర్డ్ డిడక్షన్‌తో కలుపుకుంటే రూ.12.75 లక్షల వరకు పన్ను మినహాయింపే లభిస్తుంది. చాలా రోజుల తరువాత ఇది ఎంతో ఊరటను ఇచ్చిందని చెప్పుకోవచ్చు.

మధ్యతరగతికి భరోసానిచ్చిన బడ్జెట్

- పాకాల శంకర్‌గౌడ్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు



దశాబ్దకాలంగా ఆదాయ పన్ను పరిమితి పెంచాలని వేతన జీవులు డిమాండ్ చేస్తున్నారని ఈ బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు పెంచడం హర్షణీయం. దేశవ్యాప్తంగా 50వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటుచేయడం ద్వారా విద్యార్థులల్లో శాస్త్రీయ వైఖరులు పెరుగుతాయి. నూతన ఆవిష్కరణలు వస్తాయి. జీడీపీలో కనీసం 6శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలి. ప్రస్తుత బడ్జెట్ పద్దులో కేవలం 3.93 శాతం నిధులు కేటాయించారు.

ఆదర్శవంతమైన బడ్జెట్..

- కొమ్ము రమేష్, బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు భారీ ఊరటను ఇచ్చింది. గతంలో ఉన్న విధానానికి భిన్నంగా కొత్త స్లాబ్ విధానంలో 12.75 లక్షల వరకు టాక్స్ మినహాయింపు ఇవ్వడం మంచి పరిణామం. ఎడ్యుకేషన్ రుణాలపై టీడీఎస్ ఎత్తివేయడం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని దేశంలో పెంచాలనే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేశారు. అన్నివర్గాల ప్రజలు సంతృప్తి చెందే విధంగా, ఆదర్శవంతంగా కేంద్ర బడ్జెట్ ఉంది.

అన్నివర్గాలకు అనుకూలమైన బడ్జెట్

- రేవోజు సదానందం, ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాల ప్రజలకు అనుకూలంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంచడం మంచి పరిణామం. క్యాన్సర్, ఇతర మందులపై సుంకాలను ఎత్తివేయడం, మధ్యతరగి ఉద్యోగులను టాక్స్ నుంచి మినహాయింపు ఇచ్చారు. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూ, యువతకు ప్రాధాన్యం ఇచ్చారు.

రైతులకు పెద్ద పీట వేయడం అభినందనీయం

- ఎగుమాంటి రూపేందర్‌రెడ్డి, యువ రైతు, తిప్పాపూర్



చాలా సంవత్సరాల నుంచి బడ్జెట్‌ను చూస్తున్నాం. కానీ ఈ యేడు రైతులకు పెద్ద పీట వేస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం చాలా సంతోషంగా ఉంది. పప్పు ధాన్యాల కోసం ప్రణాళిక రూపొందించి, మూడు రకాల పప్పుదినుసులకు స్వయం సమృద్ధి కల్పించడం సంతోషకరం, రైతులకు ఇచ్చే కిసాన్ క్రెడిట్ రుణాలు రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచడం వంటి అంశాలతో ప్రవేశపెట్టిన బడ్జెట్ సంతోషకరంగా వుంది.

తెలంగాణకు అన్యాయం..

- మూషం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగింది. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా కూడా ఒక్క పరిశ్రమకు కూడా నిధులను తీసుకరాలేదు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తోపాటు ఈఎస్‌ఐ ఆసుపత్రి గురించి ఏమీ చేయలేదు. ఉద్యోగుల దగ్గర నుంచి డబ్బులను సేవింగ్ పేరుతో తీసుకొని విదేశీ కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడానికి ట్యాక్స్‌ను తగ్గించారు. కార్మికులకు ప్రయోజనం చేకూర్చని బడ్జెట్ ఇది.

ట్యాక్స్ మినహాయింపులు హర్షణీయం

- బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు ట్యాక్స్ మినహాయింపులు ప్రతిపాదించడం హర్షనీయం. పాత రెజ్యూమ్‌లో ఎలాంటి పెంపుదల లేకపోవడం వల్ల గృహనిర్మాణ రంగం, హెల్త్ ఇన్సూరెన్స్, జీపీఎఫ్, ఉన్నత విద్యా రుణాలను నిరుత్సాహపరిచే విధంగా ఉంది. రూ.12లక్షల ఆదాయం ఉన్నవారికి రూ.4లక్షల నుంచే ఈ పన్నులను ప్రభుత్వం రాబడుతుంది. కనీసం రూ.5లక్షల పెంచాల్సి ఉంది.

పేదలతోపాటు కార్మికులను విస్మరించిన కేంద్రం

- గన్నేరం నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన పాటు కార్మికులను విస్మరించింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి గత సంవత్సరం కేటాయించిన 63 వేల కోట్లు మాత్రమే ఉన్నది, అదనంగా పెంచలేదు, ఇది పేదల బడ్జెట్ అని చెప్పటంలో మోసపూరితమైంది. ఈ బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలకు మోకరిల్లే విధంగా ఉంది. విద్యవైద్యాన్ని విస్మరించారు.

కార్మికుల కష్టాన్ని గుర్తించని కేంద్ర బడ్జెట్

- కోడం రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి



కేంద్రం ప్రకటించిన బడ్జెట్ కార్మికుల కష్టాన్ని గుర్తించలేదు. ఐదేళ్ల కనిష్టానికి తగ్గిన కార్మికుల వేతనాలు పెరిగిన కార్పొరేట్ల నికర లాభాల సగటు కార్మిక చట్టాల మార్పు, పని గంటల పెంపు అన్యాయం జరిగింది. ఈ బడ్జెట్‌లో కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది.

కొన్ని రాష్ట్రాలకే అన్నట్లుగా ఉంది..

- నాగుల సత్యనారాయణ, చైర్మన్ జిల్లా గ్రంథాలయ సంస్థ



కేంద్ర బడ్జెట్ అంటే కొన్ని రాష్ట్రాల బడ్జెట్ అన్నట్లుగానే ఉంది. వేతన జీవులకు ఊరటను ఇచ్చినా, పేద ప్రజలకు ఉపయోగపడేలాగా లేదు. బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆ రాష్ట్రానికి వరాలు కురిపించారు. తెలంగాణకు మొండిచేయి చూపించారు.

నిరాశపరిచిన బడ్జెట్...

- తోట ఆగయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచింది. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో రైతులకు అన్యాయమే జరిగింది. గ్రామీణ ప్రజలకు బడ్జెట్‌తో మేలు కలుగలేదు. అన్ని వర్గాల ప్రజలు ఆశ గా చూసిన బడ్జెట్ మాత్రంగానే ప్రవేశపెట్టడం బాధాకరం.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలయ్యేలా చూడాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



కస్తూరిబా పాఠశాలను సందర్శిస్తున్న కలెక్టర్

కోనరావుపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవమయ్యేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారులు, సిబ్బందిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాల, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రి ఆవరణ, ఇన్‌పేషెంట్ వార్డ్, ల్యాబ్, ఫార్మసీ పరిశీలించారు. అనంతరం పీహెచ్సీ పరిధిలో వైద్య సేవలు పొందుతున్న గర్భిణులతో కలెక్టర్ నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం వైద్యులు, ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడారు. మండలంలోని గర్భిణులకు ప్రభుత్వ దవాఖానాల్లో అందిస్తున్న సేవలు, మందులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం కేజీబీవీ, ప్రభుత్వ కళాశాల, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీచేసి మాట్లాడారు. కోనరావుపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) కలెక్టర్ తనిఖీ చేసి తరగతి గదులు, స్టోర్‌రూమ్ ఆహారం వంట గదిని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, సైన్సు పాఠ్యాంశాలు బోధించారు. ఇంటర్ జూనియర్ కళాశాల ను తనిఖీచేశారు. తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, టాయిలెట్స్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. తహసీల్దార్ విజయప్రకాశరావు, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, వైద్యాధికారి వేణుమాధవ్, కేజీబీవీ ఎస్‌వో ఇందిరా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేదారీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హలో మాదిగ. చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు అవునూరి ప్రభాకర్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మండెపల్లితో రంజిత్‌కుమార్ స్మారక క్రికెట్ పోటీలను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిరిసిల్ల వంశీ, క్రీడాకారులు, ఆర్గనైసజర్లు లింగం చింటు, జెగ్గాని రాము యాదవ్, అమరగోండ రాజేష్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఓబులాపూర్ పాఠశాలలో 'గోరుముద్ద' ప్రారంభం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబులాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్ తెలిపారు. ఉపాధ్యాయులు తిరుపతి, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలను శనివారం ఊరేగించారు. కొత్తగా అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మించగా విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించగా మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అయ్యప్పదీక్షదారుల ప్రత్యేక భజనలు ఆకట్టుకున్నాయి.

వంతెనలకు ఇరువైపులా గుంతలను పూడ్చాలి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోని రాపల్లివాగు వంతెన వద్దకు ఇరు వైపులా ఉన్న రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని బీజేపీ యువ మోర్చా జాతీయ కో-ఆర్డినేటర్ అనూష్ యాదవ్ కోరారు. శనివారం ఎల్లారెడ్డిపేట పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో సత్తయ్యకు నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. పర్శరాములు, రవీందర్‌నాయక్, రవి, బాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

వేములవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మైలారం రాము శనివారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ రాముతో పాటు చేరినవారు చింతల తాడెం దేవయ్య, చింతలతాడేం శ్రీను, మల్లేశం, మర్రిపల్లి మైసయ్య, పోతారం రమేష్, రాజు తదితరులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, చిలుక రమేష్, గుర్రం తిరుపతి, దూలం భూమేష్, సిరిగిరి శ్రీకాంత్, బాబున్, పోతారం రాజబోస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

● వేములవాడ రూరల్ : ఫాజుల్‌నగర్ గ్రామంలో మెడికోవర్ హాస్పటల్, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందిని వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, ఆసుపత్రి ఇంచార్జి గుర్రం కిరణ్, సంఘం సభ్యులు మల్లేశం రాకేష్, సురేష్, కోట కరుణాకర్, శ్రీకాంత్, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : మండలంలోని పలు అభివృద్ధి పనులకు 5కోట్ల35 లక్షల నిధులు మంజూరుచేసినందుకు వేములవాడలోని తెలంగాణచౌక్‌లో శనివారం సీఎం రేవతంరెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీని వాస్‌ల చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ రొండి రాజు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నేదూరి రమేష్, ఏఎంసీ డైరెక్టర్ పాలకుర్తి పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని నర్సింగాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరువుతున్న పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు జితేందర్, జలంధర్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బోయినపల్లి : హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోయినపల్లి సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్ కోరారు బోయినపల్లి మండల కేంద్రంలో లక్ష డప్పుల కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్ బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

● బోయినపల్లి : వ్యవసాయ బావులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సెస్ సంస్థ నిరంతరాయంగా కృషి చేస్తుందని బోయినపల్లి సేస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్ అన్నారు. మండలంలోని మాన్వాడ గ్రామంలో వ్యవసాయ మోటార్లకు అధికలోడు ఏర్పడడంతో రైతుల విజ్ఞప్తి మేరకు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సెస్ డైరెక్టర్ సుధాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ ప్రశాంత్ రైతులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని కేజీ టు పీజీ ఆవరణలో జాతీయ కుష్టు వ్యాధి నివారణలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ డిపిఎమ్‌ఓ దేవ్‌సింగ్, సీహెచ్‌వో రమేష్ ఏఎన్ఎం విజయ ఆశవర్కర్లు, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

● ఎలారెడ్డిపేట : మండలం గొల్లపల్లిలోని లబ్దిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం పంపిణీ చేశారు. శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, నారాయణగౌడ్, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, సుధాకర్, పర్శరాములు, సాయి, లత, మల్లయ్య పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండలంలోని తుర్కపల్లె గ్రామంలో అంగనివాడీ సెంటర్ తీయడంలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం విచారణ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజలి క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. నివేదికను ఉన్నతాధికారులను అందిస్తామని సూపర్‌వైజర్ తెలిపారు.

● సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 1 (అంధ్రజ్యోతి) : ఇంటర్మీడియోట్ పరీక్షల నేపథ్యంలో ఇంటర్ విద్యార్థులకు సోమవారం నుంచి ల్యాబ్ ప్రాక్టికల్స్‌లను ఈ నెల 3వ తేదీనుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరఘునందర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న లాబ్‌లను శనివారం అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ పరిశీలించారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు సాయంత్రం అల్పాహారాన్ని పట్టణంలోని అడెపు మురళీ చిట్‌ఫండ్ నిర్వహకులను అందించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. అధ్యాపకులు వెంకటేశంగౌడ్, సామల వికాష్‌లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సమాజంలో సమున్నత స్థానం

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులకు సమాజంలో సమున్నతమైన స్థానం లభిస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిసలుగా మారకుండా ఆటలపై దృష్టి నిలపాలన్నారు. యువతలో మార్పుకోసం క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఆటలను ప్రోత్సహించడమే కాకుండా క్రీడాకారులను గౌరవిస్తుందన్నారు. మండలకేంద్రంలో క్రీడాకారులు అనేక ఇబ్బందులు గతంలో ఎదుర్కొన్నారని, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. గ్రంథాలయానికి వెళ్లడం అలవాటుగా మార్చుకోవాలని, ఎన్నికల కోడ్ ఉన్నందున హమీలు ఇవ్వడం లేద న్నారు. క్రికెట్ పోటీలలో ప్రథమస్థానంలో ఇల్లంతకుంట, ద్వితీయస్థానంలో బెజ్జంకి జట్లు నిలువగా ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, యువజన సంఘాల అధ్యక్షుడు ఉప్పల అమరేందర్, మాజీ ఎంపీపీ అయిలయ్య, మాజీ ప్యాక్స్‌చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, కూనబోయిన బాలరాజు, అంతగిరి బాలపోచయ్య, ఒగ్గు రమేష్, గొడుగు నర్సయ్య, ప్రసాద్, కాసుపాక శంకర్, చిట్టి ప్రదీప్‌రెడ్డి, మామిడి నరేష్, మచ్చ రాజేశం, కాసుపాక రమేష్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ అర్థరహిత ఆరోపణలు'

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ సీఎం కేసీఆర్ అర్థరహిత ఆరోపణలు చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. శనివారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రజా జీవితంలోకి రావాలనీ, అసెంబ్లీ సమావేశాలకు రావాలని, ఆయన రాజకీయ అనుభావంతో మంచి చెడులను సూచించాలని, ఒక నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష నాయకుడిగా తన పాత్రను పోషించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సందర్భాలలో ఆహ్వానించారని అన్నారు. నిన్న కేసీఆర్ మాట్లాడిన మాటలు కొడుకు, కూతురు, అల్లుడికి వత్తాసు పలికినట్లుగా ఉందన్నారు. తెలంగాణ ఇచ్చినప్పుడు రాష్ట్ర మిగులు బడ్జెట్ రూ.16వేలకోట్లు ఉండేవన్నారు. తెలంగాణను రూ.7లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులదన్నారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి చక్రధర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండీ ఖాజా, కాసర్ల రాజు, దుబాల వెంకటేశం, మాజీ కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, కత్తెర దేవదాస్, రాగుల జగన్, వెంగళ లక్ష్మీనర్సయ్య, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, బొప్ప దేవయ్య, వెల్ముల తిరుపతిరెడ్డి, నళినీకాంత్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌పై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్ అన్నారు. జిల్లా జడ్జి ప్రేమలత ఆదేశాల మేరకు అంతర్జాతీయ క్యాన్సర్ డే సందర్భంగా మండలంలోని గోపాల్‌రావుపల్లెలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ రమేష్, డాక్టర్ లీలాశిరిష, మానేరు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ న్యాయవాదులు అడెపు వేణు, మల్లేష్ అంజనేయులు, అన్సార్ అలీ, బాబు, పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలి..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలని, ముదిరాజ్‌ల చిరకాల కోరికను నెరవేర్చడానికి కృషి చేస్తానని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల పట్టణం కళ్యాణలక్ష్మి గార్డెన్స్‌లో శనివారం శ్రీ పెద్దమ్మతల్లి ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవంకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో ఎన్నికల అధికారి కరుణాల భద్రచలం ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చొక్కాల రాము, ఉపాధ్యక్షులుగా గొడుగ లక్ష్మీనర్సయ్య, శివంది దేవేందర్, పంబాల దేవరాజు, రేగుల రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సారుగు నరేష్, కోశాధికారిగా కంకణాల శేఖర్‌బాబు, కార్యదర్శులుగా పెరివెల్లి రమేష్, తునికి నరేష్, గొడుగు శంకర్, రేగుల పర్శరాములు, సంయుక్త కార్యదర్శిగా జంగపల్లి చంద్రశేఖర్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఆది శ్రీనివాస్ మాట్లాడారు ముదిరాజ్ కులస్తుల చిరకాల కోరిక బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చడానికి తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. మిడ్‌మానేరు డ్యాంలో చేపల పెంపకానికి కేజ్‌కల్చర్ ద్వారా సబ్సిడీ ఇవ్వడంజరుగుతుందని మత్స్యకారులు ఈ పథకాన్ని వినియోగించుకో వాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రామును ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి సన్మానించారు.జిల్లా మత్సపారిశ్రామిక సహకార జిల్లా చైర్మన్ చొప్పారి రామచంద్రం, వైస్‌చైర్మన్ అంబటి శేఖర్, బీసీ స్టడి సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మాండ్లు, ఫిషరీస్ ఫెడరేషన్ మాజీచైర్మన్ పిట్టల రవీందర్, మాజీ జడ్పిటీసీ కోడి అంతయ్య, టీజేఏసీ రాష్ట్ర నాయకుడు బొజ్జ కనకయ్య, రెడ్డవేణి గోపి, రేగుల మల్లిఖార్జున్, దేవుని నర్సయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి

వేములవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జంగం రాజేందర్ (49) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడుగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా, బిజెపి పట్టణ శాఖ అధ్యక్షుడిగా రాజేందర్ పనిచేశారు. ఆయన మృతి పట్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు రేగుల సంతోష్ బాబు, బిజెపి నేత గోపు బాలరాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కారు, బైకు ఢీ.. ఒకరికి గాయాలు

చందుర్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం కారు బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం మండలంలోని లింగంపేటకుకు చెందిన సునీల్ కారులో వేములవాడకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా వేములవాడలోని సాయినగర్‌కు చెందిన సాయి అనే యువకుడు బైక్‌పై వేములవాడకి వెళ్తుండగా చందుర్తిలో అంబేద్కర్ బస్టాండ్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. సాయికి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు.

సైక్లిస్టును ఢీకొన్న కారు

చందుర్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మరిగడ్డలో సైక్లిస్టును కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యా యి. మర్రిగడ్డ గ్రామానికి చెందిన మరుపాక భిక్షపతి సైకిల్‌పై వెళ్తుండగా కోరుట్ల పట్టణా నికి చెందిన ఎండి ఉమర్ కారుతో ఢీకొన్నా డు. గాయపడిన భిక్షపతిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. భిక్షపతి తండ్రి రామస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అశోక్ తెలిపారు.

రాజన్నను దర్శించుకున్న సంగారెడ్డి ఎస్పీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, సూపరింటెండెంట్ వెంకటప్రసాద్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.